https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 358 గురువారం 9-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## బిల్లులు కడితేనే ఎత్తిపోతలకు విద్యుత్

**రూ.33 వేల కోట్లకు పైగా బకాయిలున్నాయి..**

**నీటి పారుదల శాఖకు ఇంధన శాఖ అల్టిమేటం**

**ఎత్తిపోతల పథకాలు ఐరావతంలా మారాయి: ఉప ముఖ్యమంత్రి భట్టి**

**ఆచితూచి పంపులు నడపండి: ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 8**

రూ.33వేల కోట్ల మేర బిల్లులు బకాయి పడ్డారు. ఇకపై బిల్లులు చెల్లిస్తేనే ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా చేస్తాం. లేదంటే ఇవ్వలేం.. అంటూ నీటి పారుదల శాఖకు ఇంధన శాఖ తేల్చిచెప్పింది. ఎత్తిపోతల పథకాల పంపులను ఏ సమయంలో ఆపరేట్ చేయాలి?, బకాయిల చెల్లింపుల అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో బుధవారం కీలక సమావేశం జరిగింది. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్థిక, ఇంధన, నీటపారుదల శాఖ ఉన్నతాధికారులు, ట్రాన్స్‌కో , డిస్కమ్‌ల సీఎండీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకే ఎత్తిపోతల పథకాల పంపులు నడిపించాలని, ఆ సమయంలో సౌర విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉంటుందని, తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందని సూచన చేశారు. దీనివల్ల విద్యుత్ సంస్థలపైనా భారం పడదన్నారు. విద్యుత్ సంస్థలు రూ.50 వేల కోట్లకు పైగా అప్పుల్లో ఉన్నాయని, ఇందులో రూ.33,653కోట్లు నీటిపారుదల శాఖ నుంచే రావాలన్నారు. బిల్లులు కట్టకుండా 24 గంటల పాటు విద్యుత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధిక ధరకు లభించే కరెంట్‌తో కాకుండా తక్కువ ధరకు లభించే సౌరవిద్యుత్‌తో పంపింగ్ చేసుకోవాలని నవీన్ మిట్టల్ సూచించారు. ఇందుకు ఎత్తిపోతల పథకాల సలహాదారుడు పెంటారెడ్డి బదులిస్తూ.. ఎత్తిపోతల పథకాల్లో వినియోగించే మోటార్లు/పంపులను పగటిపూట నడిపించి రాత్రి పూట ఆపితే పంపులు దెబ్బతింటాయని తెలిపారు. కాళేశ్వరంలోని ప్యాకేజీ-6లో నంది మేడారం పంప్‌హౌస్‌లోని ఓ మోటార్, ప్యాకేజీ-8లో రామగుడులోని పంపులు గతంలో దెబ్బతింటే ఒక్కో పంపు మరమ్మతుకు రూ.25 కోట్లు ఖర్చయిందని చెప్పారు. ఇతర పంపులకు, ఎత్తిపోతల పథకాల పంపులకు తేడా ఉందని, 24 గంటల పాటు నిరాటంకంగా ఏడాదంతా పంపులు నడిచినా ఫర్వాలేదు కానీ ఉదయం నడిపి రాత్రి ఆపేస్తే పంపుల్లోని ఇంపెల్లర్‌లు దెబ్బతింటాయని చెప్పారు.

## భూ దందా మీది.. నిందలు మా పైనా?

**- 2014లో నాదర్‌గుల్ భూముల రిజిస్ట్రేషన్ - మ్యుటేషన్ కూడా బీఆర్ఎస్ హయాంలోనే.. - 3 సంస్థలకు గత ప్రభుత్వమే కట్టబెట్టింది**

**- ఓ నిర్మాణ సంస్థతో డీల్ కుదుర్చుకొని.. - ఆ తర్వాత పొంగులేటి కబ్జా అంటూ రాశారు - గుమస్తా పత్రిక వారికి రూ.కోట్లు ముట్టాయి**

**- వట్టినాగులపల్లి వివాదం.. ఆ హోం సంస్థకు, - షా కుటుంబంలోని వ్యక్తికి మధ్య పంచాయితీ - దానిని మా ప్రభుత్వానికి అంటగడుతున్నారు**

**- హరీశ్, కేటీఆర్ ఖబడ్దార్.. మీరు చేసినవన్నీ త్వరలో బయటకొస్తాయి: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8**

నాదర్‌గుల్ భూములకు సంబంధించిన దందా పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు. ఆ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వారి హయాంలోనే జరిగాయన్నారు. దందాలన్నీ వారు చేసి.. నిందలు తమ ప్రభుత్వంపై మోపుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీకి చెందిన పత్రికలో తొలుత.. జాగీర్‌లోకి ఓ పెద్ద నిర్మాణ సంస్థ అడుగు పెట్టిందంటూ రాశారని, అనంతరం ఆ నిర్మాణ సంస్థతో వారికి డీల్ కుదరడంతో పొంగులేటి కబ్జా అంటూ రాశారని తెలిపారు. వారి బురదను తమ ప్రభుత్వంపై చల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ నేతలు భూములను దోచుకున్నారని ఆరోపించారు. పొంగులేటి బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "నాదర్‌గుల్ సర్వే నంబరు 613లో ఉన్న 373 ఎకరాలను యునైటెడ్ ల్యాండ్ మార్క్స్, ఆల్ఫా ఎస్టేట్స్, ఒమేగా డెవలపర్స్ అనే మూడు సంస్థలకు 2014 సెప్టెంబరు 1న రిజిస్ట్రేషన్ చేశారు. ఆ డాక్యుమెంట్లను 2016 సెప్టెంబరు 24న మ్యుటేషన్ చేశారు. ఆ సమయంలో అధికారంలో ఉన్నది ఎవరు?" అంటూ ధ్వజమెత్తారు. కోర్టు కేసు ఉంటే కనీసం వారు కౌంటర్ వేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కౌంటర్ దాఖలు చేశామని చెప్పారు. పత్రికను అడ్డుపెట్టుకుని అవాస్తవాలు రాస్తున్నారని మండిపడ్డారు. బావ బావమరుదులు పెద్ద నిర్మాణ సంస్థ అధినేతను రహస్యంగా కలుసుకుని.. వారి వాటాపై స్పష్టత వచ్చాక తనపై నింద మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు భూమిపై కొన్నిసార్లు ప్రభుత్వ భూమి అని, మరికొన్నిసార్లు ప్రైవేటు భూమి అని 2004 నుంచి వివాదాలు నడుస్తున్నాయని పొంగులేటి తెలిపారు. కోర్టు కేసులు



నడుస్తున్నాయని, పోలీసుల సహకారంతో భూమిని స్వాధీనం చేసుకున్న సందర్భాలూ గత ప్రభుత్వంలో జరిగాయన్నారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వమే 3 సంస్థలకు రిజిస్ట్రేషన్ చేసిందన్నారు. ఈ ఫైళ్లపై సంతకాలు చేసింది మీరు కాదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. 2021 ఫిబ్రవరి 10న ఆ భూముల్లో రోడ్లు, రేకుల ప్రహరీలు లేవని, 2021 డిసెంబరు 5 నాటి గూగుల్ చిత్రం చూస్తే కొన్నిచోట్ల రోడ్లు, రేకుల ప్రహరీ కనిపిస్తాయని, 2022 జనవరి 17 నాటికి భూమిలో పూర్తిగా రేకులతో ప్రహరీ, రోడ్లు ఏర్పడ్డాయంటూ గూగుల్ చిత్రాలను మంత్రి ప్రదర్శించారు. తమ సర్కారు వచ్చాక నాలా కన్వర్షన్ కోరి తే చేయబోమని తిరస్కరించామన్నా రు. ఈ భూముల వివాదంపై 2022లో కొంత మంది సుప్రీంకోర్టులో కేసు వేస్తే.. నాటి పాలకులు కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కౌంటర్ దాఖలు చేశారన్నారు. నాదర్‌గుల్ భూముల విషయంలో కేసీఆర్‌కు ఆత్మీయుడైన బీఆర్ఎస్ పత్రికలోని ముఖ్యుడికి ఆత్మకు కోట్ల రూపాయలు ముట్టాయన్నారు. మొదటి రోజు ఓ పెద్ద నిర్మాణ సంస్థ ఎంట్రీ అని రాసిన ఆ పత్రిక.. మూడో రోజు పొంగులేటి కబ్జా అని రాయడంలో ఉ న్న ఆంతర్యమేంటి? బావాబామ్మర్దులు ఇద్దరికీ పెద్ద నిర్మాణ సంస్థ అధినేతకు మధ్య రహస్య డీల్ కుదరడం.. వాటా ఇస్తామని హామీ ఇవ్వడం కారణం కాదా? అని ప్రశ్నించారు.

## సమాజ అభివృద్ధికి చేయి కలపండి

**ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి.. సహకరిస్తాం**

**సీఎస్ఆర్ నిధుల అంశంలో పలు కంపెనీల ప్రతినిధులతో సీఎం**

**హైదరాబాద్, ఏప్రిల్ 8**

సమాజాభివృద్ధి కోసం వెచ్చించే నిధులను ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా భావించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్ ) నిధుల అంశంపై వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సీఎస్ఆర్ కింద కంపెనీలు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలని సీఎం రేవంత్ ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, జలవనరుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తోందని తెలియజేశారు. కంపెనీలు వీటితోపాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకుని వాటికి సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని కోరారు. ప్రభుత్వం, కంపెనీలు కలిపి చేసే వ్యయంతో రాష్ట్ర విద్యార్థులను ప్రపంచస్థాయి నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను అందుకునేలా తయారుచేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యపై పెట్టే ఖర్చును తాము భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్‌లోనే 44 శాతం మంది ఉన్నారని, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్నిరకాల మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటివరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక కార్యదర్శిని నియమించామని, కంపెనీల ప్రతిని



ధులు ఆ ప్రత్యేక కార్యదర్శితో సమన్వయం చేసుకోవాలన్నారు. కంపెనీలు తమకు ఆసక్తి ఉన్న విద్య, వైద్యం, జలవనరులు, నైపుణ్యశిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా ఏ విభాగానికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. కంపెనీలకు కావాల్సిన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కాగా, విద్యాభివృద్ధికి రహేజా గ్రూప్ రూ.50కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10కోట్ల చొప్పున కేటాయించేందుకు ముందుకువచ్చాయన్న సీఎం వారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ.. సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటివరకూ ఎవరూ ఇలా తమను సంప్రదించలేదని తెలిపారు.

## దొంగ ఓట్లు.. హింసకు చోటులేదు!

**ఎన్నికల వేళ టీఎంసీకి ఎన్నికల సంఘం హెచ్చరిక**

**బీజేపీతో ఇదే భాష వాడే ధైర్యం ఉందా?: టీఎంసీ**



**కోల్‌కతా, ఏప్రిల్ 8:**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల సంఘం(ఈసీ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దొంగ ఓట్లు, బూత్ ఆక్రమణలు వంటి చర్యలను సహించబోమని పేర్కొంది. ఈసారి భయం, హింస, బెదిరింపులు, ప్రలోభాలకు తావులేకుండా ఎన్నికలు జరగాలని స్పష్టం చేసింది. అలాగే బూత్ క్యాప్చరింగ్, బూత్ జామింగ్‌తో పాటు ఓటర్ల సమీకరణకు, ప్రవేశానికి అంతరాయం కలిగించే సోర్స్ జామింగ్ వంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించింది. ఇది టీఎంసీకి చేస్తున్న సూటి హెచ్చరిక అని 'ఎక్స్' వేదికగా ఈసీ పేర్కొంది. ఈసీ వ్యాఖ్యలపై తృణమూల్ నేతలు తీవ్రంగా స్పందించారు. ఈసీ కేవలం ఒక పార్టీనే లక్ష్యంగా చేసుకుంటోందని టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బీజేపీ దళారిగా ఆయన అభివర్ణించారు. బీజేపీ విషయంలోనూ ఇదే తరహా భాషను ఉపయోగించే ధైర్యం ఆయనకు ఉందా అని ప్రశ్నించారు. మరోవైపు, టీఎంసీ ప్రతినిధి బృందానికి, ఈసీకి మధ్య బుధవారం జరిగిన భేటీ రసాభాసగా మారింది. బీజేపీ అనుకూల, అవినీతి అ??ధికారులను ఎన్నికల విధుల్లో నియమిస్తూ నిష్పక్షపాత ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించినందుకు.. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తమను సమావేశం నుంచి వెళ్లిపొమ్మన్నారని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ చెప్పారు. ఇదిలా ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన 'సర్' ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా నుంచి 91లక్షల మంది పేర్లను తొలగించడంపై కోర్టును ఆశ్రయిస్తామని సీఎం మమత అన్నారు.

## గుజరాతీలపై చేసిన వ్యాఖ్యలపై ఖర్గే విచారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:**



గుజరాత్ ప్రజల పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని, వారిని నిరక్షరాస్యులంటూ చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నానని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. గుజరాత్ అన్నా.. ఆ రాష్ట్ర ప్రజలన్నా తాను ఎప్పుడూ గౌరవిస్తానని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. "కేరళం ఎన్నికల ప్రచారంలో గుజరాతీల పట్ల నేను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారు. అయినప్పటికీ.. ఆ వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నా." అని తెలిపారు. ఆదివారం కేరళం ఎన్నికల ప్రచారంలో ఖర్గే మాట్లాడుతూ.. "గుజరాత్ ప్రజలు నిరక్షరాస్యులు. అందుకే ప్రధాని మోదీ వారిని మోసం చేస్తున్నారు. కానీ, కేరళం ప్రజలు విద్యావంతులు.. వీరిని ఎవరూ మోసం చేయలేరు." అని అన్నారు.

## కేరళ, అస్సాం అసెంబ్లీలకు నేడే పోలింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:**

కేరళ, అస్సాం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం పూర్తి కానుంది. ఈ రెండు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా గురువారమే జరగనుంది. కర్ణాటక, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలను కూడా ఈ రోజే నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. కేరళలో సీపీఎం నేతృత్వంలోని అధికార ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటముల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. కేరళలో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని, చెప్పుకోదగిన సంఖ్యలో సీట్లు సాధించాలని బీజేపీ పోరాడుతోంది. కేరళలో పదేళ్లుగా ఎల్డీఎఫ్ అధికారంలో ఉంది. దీంతో, సహజంగానే ఈ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉంది. కానీ, తమ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో ప్రజలు ఈసారి కూడా తమకే అధికారాన్ని కట్టబెడతారని సీఎం విజయన్ భావిస్తున్నారు. కానీ, ఇటీవల కొన్ని సర్వేలు యూడీఎఫ్ వైపు మొగ్గు ఉందని వెల్లడించాయి.



కేరళలో మొత్తం 140అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 883మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2.71కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభం అవుతుంది. సాయంత్రం 6గంటలకు ముగుస్తుంది. ఇక అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్‌పై ధీమాగా ఉంది. సర్వేలు కూడా అస్సాంలో ఎన్డీయేదే అధికారం అని స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడ 126 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంది. మొత్తం 722మంది బరిలో ఉన్నారు. 2.50కోట్ల మంది ఓటు వేయనున్నారు. పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు 294మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 9.5లక్షల మంది ఓటర్లున్నారు. ఇక్కడ ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగట?్ర-డీఎంకే కూటమి మధ్య పోటీ ఉంది. ఇదిలా ఉండగా, కర్ణాటకలో దావణగెరె సౌత్, బాగల్కోట్.. నాగాలాండ్‌లోని కోరిడాంగ్, త్రిపురలో ధర్మనగర్ స్థానాలకు గురువారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నాలుగు స్థానాల్లో ఎమ్మెల్యేల మరణం కారణంగా ఉప ఎన్నికలను నిర్వహిస్తున్నారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలతో పాటు ఈ నాలుగు స్థానాల ఓట్ల లెక్కింపు మే 4న ఉంటుంది. గోవాలోని పోండా నియోజకవర్గానికి కూడా ఉపఎన్నిక జరగాల్సి ఉండగా బాంబే హైకోర్టు ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. గోవాలో కొన్ని నెలల్లోనే(ఏడాది లోపు) అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో, ఒక్క స్థానానికి ఉప ఎన్నిక అక్కర్లేదని బాంబే హైకోర్టు భావించి, ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేసింది.

# మారుతున్న ప్రపంచ దృశ్యంలో మోదీ



వర్తమాన ప్రపంచంలో మహా శక్తిమంతమైన నాయకులు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్. ఈ ఇరువురి నిర్ణయాలు అంతర్జాతీయ వ్యవహారాలను ప్రభావితం చేస్తాయి. ఈ కోవకు చెందిన మరో ఇద్దరు నాయకులు: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు. ఈ నాయకుల మాటలు, చర్యలు వారి వారి దేశాల సరిహద్దులకు ఆవల ఎల్లెడలా మంచిగానో చెడుగానో పర్యవ సిస్తాయి. ఇటువంటి శక్తిమంతమైన నాయకుల సరసన తానూ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. ప్రపంచ గమనాన్ని నిర్దేశిస్తున్న అపూర్వ రాజనీతిజ్ఞుడు నరేంద్ర మోదీ అని ఆయన పార్టీ ఇప్పటికే ఘంటాపథంగా చెప్పుతోంది. అయితే యథార్థం భిన్నంగా ఉన్నది. భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో, అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థలతో పోల్చిచే, చిన్నది. తలసరి ఆదాయం విషయంలో రష్యా, ఇజ్రాయెల్‌లతో పోల్చితే భారతీయుల తలసరి ఆదాయం చాలా చాలా తక్కువ. గణాంకాలను చూడండి (తొలి అంకె స్థూల దేశియోత్పత్తి పరిమాణంబీ రెండో అంకె తలసరి ఆదాయం. అన్ని అంకెలు అమెరికా డాలర్లలో): అమెరికా: 30.51 ట్రిలియన్‌బీ 89,000బీ చైనా: 19.23 ట్రిలియన్, 13,800బీ రష్యా: 2.54 ట్రిలియన్, 17,500బీ ఇజ్రాయెల్: 0.6 ట్రిలియన్, 54,000బీ ఇండియా: 4.19 ట్రిలియన్, 2,900. భారత్ ఆర్థిక వ్యవస్థ కంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ 7 రెట్లు, చైనా ఆర్థిక వ్యవస్థ 4.5 రెట్లు పెద్దవి. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థే కావచ్చు కానీ మన ప్రస్తుత స్థూల దేశియోత్పత్తి రెట్టింపు కావడానికి పది సంవత్సరాల సమయం పడుతుంది. అప్పటికి అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థల పరిమాణం మరింతగా పెరుగుతుంది. చెప్పవచ్చినదేమిటంటే స్థూల దేశియోత్పత్తిలో భారత్, అమెరికాల మధ్య అంతరం, అలాగే భారత్ చైనాల మధ్య అంతరం మరింతగా పెరుగుతుందేగానీ తగ్గే అవకాశం ఎంతమాత్రం లేదు. రష్యా, ఇజ్రాయెల్‌ల స్థూల దేశీయోత్పత్తి పరిమాణాలు చిన్నవేకానీ భారత్ తలసరి ఆదాయంతో పోలిస్తే రష్యా తలసరి ఆదాయం 6 రెట్లు, ఇజ్రాయెల్ తలసరి ఆదాయం 18 రెట్లు అధికంగా ఉన్నది. ఈ గణాంకాలు అన్నీ భారత్ ప్రస్తుత పాలకులకు మినహా ప్రపంచ నాయకులు అందరికీ తెలుసు సుమా! ప్రపంచ దేశాలు భారత్‌ను గౌరవిస్తున్నాయి, సందేహం లేదు. మనకు లభిస్తున్న గౌరవాదరాలకు కారణాలు ఏమిటి? మన ప్రజాస్వామ్యం, సముజ్వల చరిత్ర, పురాతన సంస్కృతి, ప్రపంచ శాంతి పరిరక్షణలో నిర్వహిస్తున్న పాత్ర, భారతీయ మార్కెట్ పరిమాణం, శక్తి సామర్థ్యాలు, అన్నిటికీ మించి అత్యధిక జనాభా ఉన్న సమాజం. అంతేగానీ ఒక అగ్రరాజ్యమనే భావనతో భారత్‌కు ఈ గౌరవాదరాలు లభించడం లేదు. ఇదొక నిష్ఠుర సత్యం. ఏ దేశమైనా ఇతర దేశాలతో సంబంధాల విషయంలో వాణిజ్యానికి అధిక ప్రాధాన్యమిస్తుంది. ప్రాంతీయంగా సుస్థిర శాంతిని కోరుకుంటుంది. 'మీరు మాకు మిత్ర దేశమైతే, పాకిస్థాన్ పట్ల తప్పకుండా విరోధ భావం చూపాలి' అన్న వైఖరితో భారత్ వ్యవహరిస్తున్నప్పటికీ తమ తమ వాణిజ్య ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే అన్ని దేశాలు భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలు నెరపుతాయి. ఇది మనం విస్మరించకూడని వాస్తవం. వర్తమాన ప్రపంచంలో పెనుమార్పులు అనూహ్య వేగంతో సంభవిస్తున్నాయి. 2023లో జీ–20 కూటమి దేశాల శిఖరాగ్ర సదస్సును భారత్ నిర్వహించింది. ఈ శిఖరాగ్ర సదస్సు ఒక వార్షిక కార్యక్రమం. ప్రతి సభ్య దేశమూ వరుసగా ఈ శిఖరాగ్రాన్ని నిర్వహిస్తుంది. మరుసటి సంవత్సరం ఈ సదస్సుకు ఏ సభ్య దేశం ఆతిథేయిగా ఉండాలో ముందటి సంవత్సరం శిఖరాగ్ర సమావేశంలోనే నిర్ణయిస్తారు. 2024లో జీ–20 శిఖరాగ్ర సదస్సును బ్రెజిల్ నిర్వహించింది. నవంబర్ 2025లో దక్షిణాఫ్రికాలో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరగనున్నది. 2026 జీ–20 కూటమి దేశాల శిఖరాగ్ర సదస్సు అమెరికాలో జరగనున్నది. ఇంతకూ జీ–20 శిఖరాగ్ర సదస్సును నిర్వహించడమనేది పెద్ద విషయం కాదు. అయితే మన దేశం మాదిరిగా ఏ సభ్య దేశమూ ఆ సదస్సు నిర్వహణ గురించి ఘనంగా ప్రచారం చేసుకోలేదు. జీ–20 కంటే జీ–8, జీ–7 కూటములు చాలా ముఖ్యమైనవి. ఇప్పుడు కొత్తగా జీ–2 ప్రభవించింది. జిన్‌పింగ్‌తో సమావేశానికి ముందు, తరువాత కూడా చైనా అధినేతకు తనతో సమస్థాయి హోదా సమకూరుస్తూ సమాదరంతో మాట్లాడారు. ట్రంప్ మాటలు డాంబికంగా ఉన్నాయి. జిన్‌పింగ్ మనసులో ఏమున్నదో ఎవరికీ తెలియదు. అంతుచిక్కని స్పందనలు ఆయనవి. బహుళధ్రువ ప్రపంచం గురించి భారత్ ఏమి చెప్పినప్పటికీ ప్రపంచంలో రెండే రెండు అగ్రరాజ్యాలు ఉన్నాయి. రష్యా వాటికి కొంచెం వెనుకగా ఉన్నది. నిన్నటిదాకా 'అమెరికా భద్రతకు పొంచి ఉన్న ముప్పు' ఒక్కసారిగా అంతర్థానమయి పోయింది. అమెరికా, చైనాల మధ్య కొత్త 'స్నేహపూరిత' సంబంధాలతో క్వాడ్ ప్రాధాన్యం కోల్పోనున్నది. వాస్తవాలను మరింత నిశితంగా చూద్దాం: అరుదైన భూ ఖనిజాలు, సోయాబీన్ ఎగుమతులు, దిగుమతుల విషయంలో అమెరికా, చైనాల మధ్య ఒక మినీ వాణిజ్య ఒప్పందం కుదిరింది. టిక్%–%టాక్ వివాదాన్ని కూడా ఆ రెండు దేశాలు పరిష్కరించుకునే అవకాశమున్నదిబీ అమెరికా%–%భారత్ వాణిజ్య ఒప్పందం ఇంకా సంప్రతింపుల దశలోనే ఉన్నది. నెలల తరబడి జరుగుతున్న చర్చలు ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదుబీ అమెరికా, చైనాల మధ్య సుంకాల సమరం జరిగింది (పరస్పరం ప్రతీకార సుంకాలు కూడా విధించుకున్నాయి). అయితే బుసాన్‌లో ట్రంప్, జిన్‌పింగ్‌ల సమావేశమనంతరం సాంకేతికతల బదిలీ, ఎగుమతులపై నియంత్రణలు, ఓడరేవుల చార్జీలతో వివిధ అంశాలపై రెండు దేశాలూ ఒక అంగీకారానికి వచ్చినట్టు కనిపిస్తోంది. పరస్పరం సుంకాలు తగ్గించేందుకు చైనా, అమెరికాలు అంగీకరించాయి. భారత్‌పై విధించిన శిక్షాత్మక సుంకాలను సడలించేందుకు అమెరికా ఇంకా సుముఖంగా లేదుబీ చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షలు యథావిధిగా ఉంటాయి. భారతీయ కంపెనీలు రష్యా చమురును కొనుగోలుచేస్తే వాటిపై కూడా ఆంక్షలు కొనసాగుతాయిబీ అమెరికా ప్రస్తుతం చైనా సరుకులకు ఇస్తున్న ప్రథమగణ్య ప్రాధాన్యతను తగ్గిస్తుంది. అలాగే భారత్‌కు 2019లో రద్దు చేసిన జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను పెంచుకోవడానికి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి చేసుకునే దిగుమతులపై సుంకాలు తగ్గించడం లేదా తొలగించే విధానం)ను పునరుద్ధరించే అవకాశాలు లేవు అనేది స్పష్టం. ట్రంప్‌తో మోదీ చివరిసారి ఫిబ్రవరి 14, 2025న సమావేశమయ్యారు. దరిమిలా మూడు సందర్భాలలో ట్రంప్–మోదీ సమావేశం జరగవలసి ఉన్నది.


తొలుత కెనడాలో జీ–7 శిఖరాగ్ర సదస్సు తరువాత. స్వదేశానికి తిరిగి వెళ్లుతూ 'వాషింగ్టన్‌కు రావాలని మోదీని ట్రంప్ ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని మోదీ తిరస్కరించారు. ఇది సరైన నిర్ణయమే. పిదప ఈజిప్ట్‌లో గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమం. ఈ సమావేశానికి మోదీ వెళ్లలేదు. ఆ తరువాత గత నెల కౌలాలంపూర్‌లో ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు. ఈ సదస్సునుద్దేశించి మోదీ వర్చ్యువల్‌గా ప్రసంగించారు. ఆసియాన్ సదస్సుకు మోదీ స్వయంగా వెళ్లకపోవడం సరికాదని నేను భావిస్తున్నాను. ట్రంప్‌తో ద్వైపాక్షికంగా సమావేశమయ్యేందుకు, అసలు ఆయనతో సంభాషించేందుకు కూడా మోదీ ఆసక్తిచూపడంలేదని, ఉద్దేశపూర్వకంగానే తప్పించుకుంటున్నారని దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ వ్యవహారంపై ట్రంప్ తన పాత మాటను మరొకసారి పునరుద్ఘాటించాడు. తీవ్రమవుతున్న సైనిక సంఘర్షణలకు స్వస్తి చెప్పేలా భారత్, పాకిస్తాన్‌లను బలవంతం చేయడానికై 'వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోను' అని ఆ రెండు దేశాలను బెదిరించానని, యుద్ధం నాలుగో రోజున నిలిచి పోయిందని ట్రంప్ వెల్లడించాడు. ఆయన ఇలా ప్రకటించడం ఇది ఎన్నోసారో మీకు గుర్తుందా? ట్రంప్ మాటను బహిరంగంగా గానీ, పార్లమెంటులో గానీ నరేంద్ర మోదీ నిరాకరించనే లేదు. చైనా సైనిక దళాలు భారత భూభాగాలలోకి చొచ్చుకువచ్చి తిష్ఠ వేశాయని, ఇది దురాక్రమణ మినహా మరేమీ కాదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆయన మొహాన మోదీ చెప్పనే లేదు కదా. ట్రంప్, జిన్‌పింగ్‌ల మధ్య వెల్లివిరిసిన కొత్త స్నేహ సరసత జపాన్, ఆస్ట్రేలియా, తైవాన్‌తో పాటు భారత్‌కూ సమస్యలు సృష్టిస్తోంది. భారత్‌కు ఇప్పుడు దక్షిణాసియాలో ఒక్క మిత్ర దేశమూ లేదు. పశ్చిమాసియా దేశాలు సమష్టిగా కొత్త సర్దుబాట్లు చేసుకుంటున్నాయి. అంతేకాదు, భారత్‌ను పట్టించుకోకుండా ఇజ్రాయెల్‌తో కొత్త స్నేహ వారధులు నిర్మించుకుంటున్నాయి. రాజనీతిలో మన పురాతన ఆచార్యుడు ఇటువంటి క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని చెప్పాడు? చుట్టు ముట్టిన ఇబ్బందులను నమ్రతతో ఆకళింపు చేసుకుని విజ్ఞతాయు తమైన నిర్ణయాలు తీసుకోవాలని కాదూ? నరేంద్ర మోదీగారూ, ప్రస్తుతం మీరు అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై తప్పక పునరాలోచన చేయాలి. మౌలిక మార్పులతో కొత్త వైదేశిక నీతికి రూపకల్పన చేయాలి.

## సాంస్కృతిక విధానం మాటేమైంది



తెలంగాణ ఏర్పడిన పుష్కర కాలానికి పర్యాటక శాఖ విధానాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ కళాకారులకు సంబంధించిన 'సమగ్ర సాంస్కృతిక విధానం'ను నేటికీ పాలకులు రూపొందిం చలేదు. దీనికోసం గతంలో 20 మందితో సాంస్కృతిక శాఖ సలహామండలిని ప్రభుత్వం ప్రకటించింది. సంబంధిత అధికారులు మూడుసార్లు సమావేశమ య్యారు. కళాకారులకు కనీసం గుర్తింపు కార్డులు కూడా నేటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ఈ పాలసీని కోరుతూ రెండుసార్లు రవీంద్రభారతిని కళాకారులు ముట్టడిం చారు. ఆరు గంటల సేపు దీక్షలు చేపట్టారు. అయినా ఫలితం లేదు. ఈ విధాన రూపకల్పనలో గత ప్రభుత్వం లాగే ప్రస్తుత ప్రభుత్వమూ ఉదాసీనత ప్రదర్శిస్తోంది. 'పాలకులంతా ఒక తాను ముక్కలే' అన్నట్టుగా ఉంది పరిస్థితి. నిజానికి కల్చరల్ పాలసీ ఆలోచన నేటిది కాదు. మన దేశ మొదటి ప్రధాని నెహ్రూ దీనికి బీజం వేశారు. 'ఏ దేశానికైనా, ఏ భాషకైనా, ఏ కళలకైనా, ఒక స్పష్టమైన సాంస్కృతిక ప్రణాళిక ఉండాలి' అని చెబుతూ 'మెహతా కమిటీ' వేశారు. జానపద సాహిత్యం, సంస్కృతి, నాటకం, సినిమా తదితర రంగాలకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని ఆ కమిటీకి నెహ్రూ నిర్దేశించారు. తెలంగాణ సంస్కృతి విలక్షణమైనది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు పోషించిన పాత్ర అనితరసాధ్యమైనది. కానీ రాష్ట్రంలో 'సాంస్కృతిక విధానం' లేకపోవడంతో కళలకు, కళాకారులకు ప్రాధాన్యం లేకుండా పోతోంది. రాష్ట్రంలో కళాకారుల సంక్షేమం కోసం ఒక్క పథకం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. దీంతో కళాకారుల్లో భాగమైన జానపదులు ఎంతగానో నష్టపోతున్నారు. ఇప్పటికే తెలంగాణలో 36 జానపద కళారూపాలు వాటి ఉనికిని కోల్పోయాయి. ఇంకా 65కు పైగా కళారూపాలు కొన ఊపిరితో ఉన్నాయి. పాలకుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణం. తెలంగాణలో మనుషులకే కాదు... ప్రతి పల్లెకు, చెరువుకు, నదికి, కొండకు, కోటకు, కోనకు ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్రను తెలుపమని జానపదులను కదిపితే ఎన్నో ఆసక్తికర విషయాలను చెబుతారు. ఇది వారికి వారసత్వంగా వస్తున్న కళ. సర్దార్ పాపన్న, పండుగ సాయన్న, మీరాసాయబ్, సమ్మక్క%–%సారలమ్మ తదితరుల వీరగాథలన్నీ వీరి కంఠంలో ప్రతిధ్వనిస్తాయి. జానపద కళాకారులు తరాల సంస్కృతీ ప్రదాతలు.శ్రమైక జీవన సౌందర్య దృష్టికి ప్రతిరూపాలు. నేడు రాష్ట్రంలో జానపదుల పరిస్థితి దయనీయంగా ఉంది. పాలకులు పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి మరింతగా దిగజారుతోంది. వారిని కదిలిస్తే కన్నీటి గాథలే. 'మా కులాలకు, మా కళలకు ఆదరణ లేదయ్యా. తరతరాలుగా కుల పురాణాలను ఆట పాటలతోనూ, మా వాద్య పరికరాలతోనూ గానం చేస్తూ అలరించాం. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కళాకారుల ప్రదర్శనల్లో, నినాదాల్లో మా గొంతులనూ జతకలిపాం. కానీ నేడు పాలకులు పట్టించుకోకపోవడంతో చావలేక బతుకీడు స్తున్నాం' అంటూ గోడు వెళ్లబోసుకుం టున్నారు. వీళ్లంతా పాలకులు విస్మరించిన జనం. ఓటు బ్యాంకు లేని సంచార, మైనార్టీ కులం. ఇలా సామాజిక వివక్షకు, అణచివేతకు, పాలకుల నిర్లక్ష్యానికి గురైన అట్టడుగు జాతుల వారిని ఉద్దేశిస్తూ.. ఇహెచ్ కార్ అనే చరిత్రకారుడు '%ఎష్ట్రఫ్ అం ష్త్రఅర్‌శీతీఎ? ఎఅర్‌శీతీఎ టతీశీఎ ఎవశ్రీశీష%' అంటాడు. అట్టడుగు వర్గాల నుంచే చరిత్ర వచ్చిందంటూ వివరించాడు. కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు 'జానపద అకాడమీ'లను ఏర్పాటు చేసుకుని కళల్ని, జానపద కళాకారుల్ని సంరక్షించుకుంటు న్నాయి. తెలంగాణలో ఈ కృషి ఎందుకు జరగడం లేదో పాలకులు, సాంస్కృతిక సలహామండలి ఆలోచించాలి. జానపద కళల, ఇతర కళాకారుల అభివృద్ధికి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. 'సమగ్ర సాంస్కృతిక విధానం' రూపకల్పనకు నడుం బిగించాలి.

# ఫోన్ చూస్తే అంత ప్రమాదమా?



మా పాప వయసు ఒక సంవత్సరం. ఆరోగ్యంగా ఉంది. వ్యాక్సిన్ వేయించడానికి హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు పిల్లలకు ఫోన్ ఇవ్వడం, టీవీ చూపించడం చేయొద్దని పీడియాట్రీషియన్ చెప్పారు. మా పాప ఇప్పుడిప్పుడే ఫోన్ చూస్తున్నది. ఫోన్ చూస్తే మరీ అంత ప్రమాదమా? దయచేసి సలహా ఇవ్వగలరు? ఇది మంచి ప్రశ్న. ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయసులోపు పిల్లల్లో భాష బాగా అభివృద్ధి చెందుతుంది. చుట్టుపక్కల వాళ్లు మాట్లాడే మాటలు వింటూ పిల్లలు భాషను నేర్చుకుంటారు. పిల్లలు ఎన్నిసార్లు మాట్లాడటానికి ఎక్స్‌పోజ్ అయితే అంత మంచిది. దురదృష్టవశాత్తు ఈ తరం పిల్లలు వాళ్ల వయసు ఉన్న చిన్నారులతో కలిసి ఉండే సమయం తగ్గిపోతున్నది. ఫోన్, టీవీకి పరిమితమయ్యే పిల్లల్లో అర్థం చేసుకునే శక్తి తగ్గుపోతుంది. విన్న మాటలను ఏ సందర్భంలో ఎలా మాట్లాడాలన్నా గ్రహింపు శక్తిని కోల్పోతారు. సామాజిక అవగాహన పొందలేరు. అందువల్ల పిల్లల ప్రవర్తనలో విపరీత ధోరణి పెరుగుతుంది. కొందరిలో ఇది ఆటిజానికి దారితీయొచ్చు. మీ పీడియాట్రీషియన్ హెచ్చరించినట్టు.. దయచేసి పిల్లలకు ఫోన్, టీవీ అలవాటు చేయకండి. అది వ్యసనంగా మారుతుంది. చుట్టుపక్కల ఉన్న మనుషులతో మాట్లాడుతూ మాటలు నేర్చుకోవడానికి దూరమవుతారు. కాబట్టి, ఒకటి నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలు శారీరకంగా, మానసికంగా, సాంఘికంగా ఎదిగేటువంటి ప్రత్యేకమైన స్థితిలో ఉండాలి. వాళ్లు నడవడం, పరుగెత్తడం చేయాలి. సమాజంలో అందరినీ పరిశీలిస్తూ ఉండాలి. ఇతరుల మాటలు, భాషను వినడం వల్ల సమాజాన్ని అర్థం చేసుకుంటారు. ఫోన్, ట్యాబ్, టీవీకి అలవాటైతే అలాంటి అవకాశాన్ని కోల్పోతారు. కాబట్టి వైద్యులు చెప్పిన సలహా పాటించండి. మీకు తెలిసిన వాళ్లకు చెప్పండి. టీవీ, ఫోన్ చూడొద్దని చెప్పి, మీరు చూస్తూ ఉంటే.. పిల్లలు మీ మాటలు అంగీకరించరు, ఆచరించరు. కాబట్టి పెద్దలు కూడా స్వీయ నియంత్రణ పాటించాలి.


# అణు ఉన్మాదం

అనేక యుద్ధాలు ఆపాను, యుద్ధం అంచులకుపోతున్న దేశాలను హెచ్చరించి మరీ నిలువరించాను, అయినా నాకు నోబెల్‌శాంతి ఇవ్వలేదు, కనీసం నా శాంతియత్నాలను కూడా ప్రపంచం గుర్తించడం లేదు, ఐక్యరాజ్యసమితి సైతం మెచ్చుకోలేదు... అని అదేపనిగా వాపోయిన అమెరికా అధ్యక్షుడు అందుకు ప్రతిగా ప్రపంచంమీద ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నారేమో! శాంతి?దూత ట్రంప్ నోట వారంలోనే పలుమార్లు అణ్వస్త్రాలు, అణుయుద్ధాల ప్రస్తావనలు వినిపించాయి. యావత్ ప్రపంచాన్ని నూటయాభైసార్లు నాశనం చేయగల అణ్వస్త్రాలు తన వద్ద ఉన్నాయని ఆయన సగర్వంగా చెప్పుకున్నారు. ఒకపక్క శాంతిగురించి మాట్లాడుతూనే, అణునిరాయుధీకరణ మహాగొప్పదని అంటూనే, మరోపక్క మానవజాతిని సమూలంగా మట్టుబెట్టడానికి అమెరికాకు అట్టే సమయం పట్టదని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. దేశాలను దారికి తేవాలంటే సుంకాలతో మోదితే చాలని మొన్నటివరకూ ఉపన్యాసాలు దంచిన ట్రంప్ ఇప్పుడు ట్రేడ్‌వార్ కాక న్యూక్లియర్‌వార్ కోసం అర్రులు చాస్తున్నట్టు కనిపిస్తోంది. పదిరోజుల క్రితం, దక్షిణకొరియాలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ఒకరోజు ముందు ట్రంప్‌నోట ఈ అణుపాటపరీక్షల మాట వినబడింది. అందరూ చేస్తున్నదే అంటూ ఆయన చైనా, రష్యా, ఉత్తరకొరియాలను ఉదహరించడంతో పాటు పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావించారు. ఈ దేశాలన్నీ రహస్యంగా ఆ పనిచేస్తున్నాయని, తాను చెప్పిమరీ చేస్తానని అన్నారాయన. ట్రంప్ నోట పాకిస్థాన్ పేరు వినబడగానే దొంగపనులు ఆ దేశానికి అలవాటేనంటూ భారత ప్రభుత్వం విరుచుకుపడింది. అలనాటి పోఖ్రాన్ పరీక్షల శక్తియుక్తులను ప్రజలకు గుర్తుచేస్తూ అణుపరీక్షలకు మనదేశం మళ్ళీ సిద్ధపడుతోందని మీడియా కథనాలను వండివార్చుతోంది. పాక్, చైనాలు అణుబలం పెంచుకుంటూంటే మనం ఎలా ఊరుకుంటామంటూ సామాజిక మాధ్యమాల్లో దేశభక్తులు వీరంగాలు వేస్తున్నారు. ఈమారు ఎన్ని టన్నుల మందుగుండు వాడాలో, ఎంత శక్తిని విడుదలచేయాలో లెక్కలు కడుతున్నారు. అణుపరీక్షలకు సిద్ధంకమ్మని తాను ఇప్పటికే ఆదేశించాననీ, ఏర్పాట్లు మొదలయ్యాయని అమెరికా అధ్యక్షుడి నోటివెంటే రావడంతో రష్యాకు కూడా ఇక మొహమాట పడాల్సిన అవసరం లేకపోయింది. అమెరికా అణుపరీక్షలు జరిపినవెంటనే విస్ఫులింగాలు కురిపించడానికి అదీ సర్వంసిద్ధం చేసుకుంటోంది. మూడుదశాబ్దాల విరామం తరువాత అమెరికా అణుపరీక్షలకు సిద్ధపడుతూండటం ప్రపంచాన్ని పెనుప్రమాదంలోకి నెట్టేస్తోంది. రష్యా, చైనా బూచి చూపుతూ అణుపాటవాన్ని మరింత పెంచుకుంటానని ట్రంప్ ప్రకటించడం తోపాటు, అత్యంత శక్తిమంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి మినిట్‌మ్యాన్ ప్రయోగం సైతం రష్యా, చైనాలను హెచ్చరించడానికీ, ఉత్తరకొరియాను గిల్లడానికీ ఉపకరిస్తాయి. ఈ క్షిపణికి న్యూక్లియర్ వార్‌హెడ్ తగిలించకపోవచ్చును కానీ, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్నస్థితిలో ఈ అధునాతన క్షిపణిని పరీక్షించడం ప్రత్యర్థి దేశాలను హెచ్చరించడానికే. ప్రచ్ఛన్నయుద్ధకాలం నాటి వాతావరణాన్ని సృష్టించడం, అణుపోటీని రగల్చడం ట్రంప్ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఎదుటివారివద్ద అణ్వాయుధాలున్నాయన్న ఆరోపణతో శత్రువులను హతమార్చడం, దేశాలను స్వాధీనం చేసుకోవడం అమెరికాకు అలవాటు. అణుపరీక్షలు నిర్వహిస్తున్నాయంటూ ఇప్పుడు ట్రంప్ ఆరోపించిన దేశాలేవీ నిజానికి ఆ పనిచేసిన ఆధారాలేమీ లేవు. ఉత్తరకొరియా విషయంలో పాశ్చాత్యదేశాలన్నీ కట్టగట్టుకొని చేస్తున్న ప్రచారం నమ్మినపక్షంలో దానిని కొంతమేరకు మినహాయించవచ్చును. ఈ అధునాతన సాంకేతిక యుగంలో అణుపరీక్షలను రహస్యంగా జరపడం, దాచడం కష్టం. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపని మొండిఘటం పుతిన్‌ను లొంగదీయడానికో, వాణిజ్యయుద్ధంలో లొంగిరాని జిన్‌పింగ్‌ను దారికితెచ్చుకోవడానికో తన అణు హెచ్చరికలు ఉపకరిస్తాయని ట్రంప్ అనుకొనివుంటే అది పెద్ద భ్రమ. అమెరికాలోని యాభైరాష్ట్రాల్లో ముప్పై రాష్ట్రాలు ట్రంప్‌కు హారతులుపట్టి ఏడాది అయింది. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) పేరిట ఆయన దేశంలోనూ, విదేశాలతోనూ చేస్తున్న పలురకాల యుద్ధాలు ప్రజలకు అంతగా రుచించ లేదని మొన్నటి ఎన్నికల ఫలితాలు తేల్చేశాయి. న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం, న్యూజెర్సీ, వర్జీనియా డెమొక్రాట్ల చేతుల్లోకి పోవడం ట్రంప్‌కు ఎదురుదెబ్బ. ట్రేడ్‌వార్‌తో కాక, తన ఆప్తమిత్రుడు బెంజమీన్ నెతన్యాహూ తరహాలో రియల్‌వార్‌తోనే తాను అధికారంలో కొనసాగగలనని ట్రంప్ అనుకుంటున్నట్టు ఉంది.

# ఇ-మెయిల్‌కు పర్సనల్ సెక్రటరీ ఈ కొత్త ఏఐ టూల్

రోజంతా ఇ–మెయిల్స్‌కు రిట్కప్లై ఇస్తూ సమయం వృథా చేసుకుంటున్నారా? అయితే, ఈ కొత్త ఏఐ టూల్ మీ ఇ–మెయిల్స్‌ను మీలాగే రాసి.. ఆఫీస్ పనిని సులభతరం చేస్తుంది! అదెలా అంటారా? అందుకు **Perplexity** ఓ కొత్త ఇ–మెయిల్ అసిస్టెంట్‌ని లాంచ్ చేసింది. ఈ ఏఐ టూల్ యూజర్లు తమ మెయిల్ బాక్స్‌ని సమర్థంగా నిర్వహించుకోవడానికి, డ్రాఫ్ట్ తయారు చేయడానికి ఉపయోగపడుతుంది. ఇది ప్రస్తుతం **Perplexity Max** సబ్‌స్క్రైబర్‌లకు అందుబాటులో ఉంది. ఇది **Gmail, Outlook** లాంటి ప్రముఖ ఇ–మెయిల్ సర్వీసులతో సింక్ అయ్యి పనిచేస్తుంది. ఈ అసిస్టెంట్ కేవలం ఆటోమేటిక్ రిట్కప్లైలు మాత్రమే ఇవ్వదు.

ఇది యూజర్ సంభాషణ శైలిని, టోన్‌ను నేర్చుకుంటుంది. అంటే, మీ వ్యక్తిగత ట్కస్టైల్‌లోనే పర్సనలైజ్డ్ రిట్కప్లైలు తయారుచేస్తుంది. మీ క్యాలెండర్ ఆధారంగా, మీ షెడ్యూల్‌కు సరిపోయే మీటింగ్ సమయాలను కూడా సూచిస్తుంది. యూజర్ల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. దీన్ని వాడటం చాలా సులభం. మీ రిజిస్టర్డ్ ఇ–మెయిల్ ఖాతా నుంచి **assistant@perplexity.com**కు ఒక మెయిల్ పంపితే చాలు. టూల్ లింక్ అయిన వెంటనే ఆటోమేటిక్‌గా పనిచేయడం ప్రారంభిస్తుంది. ముఖ్యమైన మెయిల్స్‌ను ముందుగా చూపిస్తుంది. గ్రూప్ మెయిల్స్‌ను ఆర్గనైజ్ చేస్తుంది.




అంతేకాదు, మీ ఇన్‌బాక్స్ గురించి కూడా ప్రశ్నలు అడగవచ్చు. ఉదాహరణకు 'బోర్డు మీటింగ్ ముందు నేను ఏ మెయిల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి?' అని అడిగితే ముఖ్యమైన సమాచారాన్ని క్షణాల్లో సేకరించి చెబుతుంది.



## రాజ్ ప్రేమలో
# సాంత్వన

నాగచైతన్యతో విడాకుల అనంతరం దాదాపు నాలుగేళ్ల పాటు సమంత జీవితం అనేక ఒడిదుడుకులతో సాగింది. ముఖ్యంగా అరుదైన మయోసైటిస్ వ్యాధి బారిన పడటం అశనిపాతంలా మారింది. అయితే ఈ కష్టాలన్నింటిని ధైర్యంగా ఎదుర్కొంది సమంత. మిత్రులు, శ్రేయోభిలాషుల అండతో తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చింది. గత ఏడాది దర్శకనిర్మాత రాజ్ నిడిమోరుతో రెండో వివాహం తర్వాత నూతనోత్తేజంతో కనిపిస్తున్నది సమంత. ఈ నేపథ్యంలో విడాకుల అనంతరం తన మానసిక పరిస్థితి గురించి, రాజ్ నిడిమోరుతో రెండో పెళ్లి తర్వాత పొందిన సాంత్వన గురించి సమంత సోషల్‌మీడియాలో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టింది. 'విడాకుల అనంతరం ఒక్కసారిగా జీవితమంతా శూన్యంలా అనిపించింది. ఇకముందు ఒకరిపై ఆధారపడి జీవితాన్ని కొనసాగించొద్దనే నిర్ణయానికొచ్చాను. కానీ విధి మరోలా తలచింది. రాజ్‌తో స్నేహం, అతను పంచిన ప్రేమాభిమానాలు నాకు కొత్త జీవితాన్ని పరిచయం చేశాయి. అతని సాంగత్యంలో ఇప్పుడు మరింత ఉన్నతమైన వ్యక్తిగా పరివర్తన చెందాను' అని చెప్పుకొచ్చింది సమంత. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సమంత తెలుగులో నటిస్తూ నిర్మించిన 'మా ఇంటి బంగారం' మే 15న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే.

## శ్రీలీలని పలకరిస్తున్న
# వరుస ఫ్లాపులు..

### అయిన కూడా ఏకంగా స్టార్ హీరో సరసన ఛాన్స్?



సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లల్లో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లు--ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో అజిత్-శ్రీలీల కాంబినేషన్‌పై చర్చలు జోరుగా సాగుతున్నాయి.

## బాఫ్టాలో 'బూంగ్'
# సంచలనం

### మణిపురి సినిమాకు దక్కిన అరుదైన గౌరవం



ప్రపంచ సినీ వేదికపై భారతీయ సినిమాకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టీవీ ఆర్ట్స్‌లో (బాఫ్టా) మణిపురి చిత్రం 'బూంగ్' పురస్కారాన్ని గెలుచుకుంది. బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ కేటగిరీలో ఈ చిత్రాన్ని ఎంపిక చేశారు. ఈ విభాగంలో పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ సినిమాగా 'బూంగ్' చరిత్ర సృష్టించింది. లక్ష్మీ ప్రియా దేవి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఫర్హాన్ అక్తర్ నిర్మించారు. గుగున్ కిప్జెన్, బాలా హిజమ్ నిగ్రోజమ్, అన్గామ్ సనామాటుమ్ కీలక పాత్రల్ని పోషించారు. మణిపూర్ జాతుల సంఘర్షణ, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో బూంగ్ అనే బాలుడు తన కుటుంబాన్ని కలపడానికి చేసే ప్రయత్నం నేపథ్యంలో మానవీయ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల చిత్రాలను అధిగమించి 'బూంగ్' అవార్డును కైవసం చేసుకుంది. బూంగ్ 'బాఫ్టా' అవార్డును గెలుచుకోవడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సృజనాత్మక కౌశలానికి దక్కిన గొప్ప గౌరవమని ఎక్స్ వేదికగా ఆయన చిత్రబృందాన్ని అభినందించారు.

## 'బ్లడీ రోమియో'తో
## రొమాన్స్?

ఒక్క భారీ హిట్ చాలు కథానాయికల జాతకం మారిపోవడానికి. బాలీవుడ్ హీరోయిన్ త్రిప్తి డిమ్రి విషయంలో అదే జరిగింది. 'యానిమల్' సినిమాతో ఈ భామ యువతరంలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అంతకుముందు ఈ సొగసరి హిందీలో ఐదు చిత్రాల్లో నటించినా అంతగా గుర్తింపు రాలేదు. 'యానిమల్'తో ఒక్కసారిగా అగ్ర కథానాయికల జాబితాలో చేరిపోయింది. ప్రభాస్ 'స్పిరిట్' చిత్రం ద్వారా ఈ భామ తెలుగులో ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం త్రిప్తి డిమ్రి తెలుగులో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. నాని కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' పేరుతో ఓ చిత్రం తెరకెక్కబోతున్నది. ఇందులో త్రిప్తి డిమ్రిని కథానాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించిందని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

